కథ

# విజయనగరం

– ఎస్.డి.వి. అజీజ్


**ఆకలి దప్పికలతో వొగరుస్తూ భారంగా నడుస్తున్నారు ఇద్దరు వ్యక్తులు. వారిరువురూ అన్నాతమ్ముళ్లు. అన్నపేరు హక్కన్న. తమ్ముడి పేరు బుక్కన్న. కంపిలికి దగ్గర్లో వుండే కమలాపురం గ్రామస్తులు. వారి చిన్నతనాన్నే తండ్రి చనిపోయాడు. వారికి వున్న పెద్దదిక్కు, వారి తల్లి కమలమ్మ.**

వారలా వొగరుస్తూ పరుగులు తీస్తూ రావడానికి ఓ కారణముంది. తురుష్కుల దాడివల్ల (క్రీ.శ. 1336) కాకతీయ సామ్రాజ్యం విచ్ఛిన్నమయింది. ఓరుగల్లు వారి వశమయ్యింది. మహమ్మద్ బీన్ తుగ్లక్ (ఢిల్లీ పాదుషా) తన సేనానుల్లో నిజాం ఉల్‌ముల్క్‌ను దేవగిరికి, ఓరుగంటికి మహమ్మద్ గస్తఫాను తన తరపు రాజప్రతినిధులుగా నియమించాడు.

కొంతకాలానికి తానే ఓరుగల్లు ఏలికగా ప్రకటించుకున్నాడు గస్తఫా. తుగ్లక్‌కు కోపం వచ్చింది. హెచ్చరికలు పంపినా, గస్తఫా ఖాతరు చేయకపోయేసరికి, దేవగిరి రాజప్రతినిధి అయిన నిజాం ఉల్‌ముల్క్‌ను ఓరుగంటిపైకి పంపాడు. నిజాం దండెత్తి వస్తున్నాడన్న వార్త విన్న గస్తఫా ఓరుగంటి నుంచి పలాయనం చిత్తగించి, ఆంధ్ర, కర్నాటక సరిహద్దులో వున్న కంపిలి రాజైన జుంబుకేశ్వరుని శరణుజొచ్చాడు. కంపిలి రాజు అభయమిచ్చాడు.

గస్తఫా జంబుకేశ్వరుని ఆశ్రయంలో వున్నాడని తెలుసుకున్న తుగ్లక్ 'అతన్ని అప్పగించు' అని ఆజ్ఞ జారీచేశాడు. శరణంటూ వచ్చిన శత్రువునయినా రక్షించే గుణం కలవాడైన కంపిలి రాజు, తుగ్లక్ ఆజ్ఞను బేఖాతరు చేశాడు. 'గస్తఫాను అప్పగించే ప్రసక్తే లేదు' అని తిరుగు వర్త






మానం పంపాడు. జంబుకేశ్వరునిపై తుగ్లక్‌కు ఆగ్రహం కలిగింది. తానే స్వయంగా ఓరుగల్లుకు తరలివచ్చి, కంపిలికి పెద్దఎత్తున సైన్యాన్ని పంపాడు.

భీకరయుద్ధం! ఆ యుద్ధంలో జంబుకేశ్వరుడు హతుడయ్యాడు. గస్తఫాను బందీని చేసి ఓరుగల్లుకు తరలించారు. అతనితోపాటు చుట్టుపక్కల గ్రామాలపై పడి ధనాన్ని దోచుకున్నదే కాక ఎదురు తిరిగిన కొంతమంది ప్రజానీకాన్ని కూడా బందీలను చేసి వెంట తీసుకెళ్ళారు తుగ్లక్ సైనికులు. దేవగిరిని, ఓరుగల్లును జయించటంలో గస్తఫా ముఖ్య పాత్ర వహించినందువల్ల అతన్ని క్షమించమని, తుగ్లక్ అంతరంగికులు చెప్పారు. ఎవరిమాట వినని తుగ్లక్ గస్తఫాకు మరణశిక్ష విధించి అమలు జరిపాడు. బందీలుగా చేసి తెచ్చిన ప్రజానీకాన్ని ఓ తోటలో వుంచి సైనికులను కాపలా వుంచారు.

ఓ అర్ధరాత్రి సమయాన సైనికుల కళ్ళుగప్పి ఆ తోటలోనుంచి తప్పించుకొని పరుగులు తీశారు ఇద్దరు వ్యక్తులు.

వారే! హక్కన్న! బుక్కన్న!

***

చాలాదూరం నుంచి నడిచిరావడం వల్ల ఇద్దరిలోనూ ఆయాసం.

''అన్నయ్యా! ఇక నడవడం నావల్ల కాదు. ఒక వైపు ఆకలి. మరొకవైపు దాహం. తట్టుకోలేకపోతున్నాను'' చెప్పాడు బుక్కన్న.

''ఎలాగయినా ఓర్చుకో తమ్ముడూ! ఇంకాస్త దూరం నడిస్తే ఎక్కడయినా నీటికుంట లాంటిది కనపడకపోదు'' అని సర్దిచెబుతూ తమ్ముడ్ని మెల్లిగా ముందుకు నడిపించాడు హక్కన్న.

ఇద్దరూ కొంతదూరం నడిచాక వారికి ఓ చెట్టు కింద ధ్యానం చేసుకుంటున్న ఓ అరవై యేళ్ళ వృద్ధుడు అగుపించాడు. అతను ధరించిన వస్త్రాలను బట్టి, అతనో సాధువని, నుదుటిపై వున్న నామాన్ని బట్టి శివభక్తుడని తెలుసుకున్నారిద్దరూ. ఇద్దరూ వెళ్ళి ''స్వామీ'' అంటూ పలుకరించారు. ధ్యానం చేసుకుంటున్న ఆ వ్యక్తి, కళ్ళు తెరచి ఇద్దరి వంక చూస్తూ చెప్పాడు.

''శీఘ్రమేవ రాజ్యలక్ష్మీ ప్రాప్తిరస్తు''

ఆ మాటలకు అంత అలసటలో కూడా నవ్వొచ్చింది బుక్కన్నకు. చిన్నగా నవ్వాడు. తమ్ముడి వంక చిరుకోపంగా చూశాడు హక్కన్న. నవ్వడం మానుకున్నాడు.

''స్వామి అమిత దాహంతో వున్నాము. ఇక్కడికి దగ్గర్లో ఏదైనా నీటికుంట వుంటే చెప్పండి! వెళ్ళి దాహం తీర్చుకుంటాం'' అంటూ చేతులు జోడించి వినయంగా పలికాడు హక్కన్న. హక్కన్న అడిగిన దానికి సమాధానంగా తనవద్ద వున్న కమండలం హక్కన్న చేతికిస్తూ అన్నాడా వృద్ధుడు.

''ఇందులోని నీరు తాగండి! మీ అలసట తీరుతుంది''

''మరి మీకు?''

''నీరు, ఆహారం లేకపోయినా నేను కొన్నాళ్ళపాటు వుండగలను.''

''అదెలా సాధ్యం స్వామీ?''

''సాధనతో అన్నీ సాధ్యమే... ముందు మీ దాహం తీర్చుకోండి!''

అన్నదమ్ములిద్దరూ కమండలంలోని నీటిని తాగి, ఆ సాధువుకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. హక్కన్నలో సందేహం.

''మీరు అన్యథా భావించకపోతే, ఓ మాట అడగాలని వుంది'' అంటూ అడిగాడు.

''అడుగు నాయనా?'' చిర్నవ్వున పలికాడు ఆ సాధువు.

''రాజ్యలక్ష్మీ ప్రాప్తిరస్తు!'' అంటూ దీవించారు. మేము కంబళ్ళు నేసి అమ్ముకొని బతికేవాళ్ళం. మాకు రాజ్యలక్ష్మి ఎలా సంప్రాప్తిస్తుంది?'' తన సంశయం వ్యక్తం చేశాడు హక్కన్న.

''ధనం, రాజ్యం ఏనాడు ఒకరి సొత్తు కాదు. కాలానుగుణంగా వ్యక్తుల చేతుల్లోకి మారుతూ వుంటుంది. పూర్వం ఎందరెందరో రాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. ఇప్పుడు తురుష్కుల వశంలో వుంది. మీరూ తెలివితేటలు ప్రదర్శిస్తే, సాహసాలకు పూనుకుంటే ఈ ప్రాంతానికి మీరే రాజులవుతారు.''

హక్కన్నకు ఆ సాధువు పలుకుల్లోని ఆంతర్యమేమిటో అర్థం కాలేదు.

''అదెలా సాధ్యం స్వామీ?'' ప్రశ్నార్థకంగా ముఖంపెట్టి అడిగాడు.

''నా మాట వమ్ముకాదు. నేను కళ్ళు తెరవగానే మీరగుపించారు. మిమ్మల్ని చూడగానే మీరు ఏలికలు అవుతారు అనిపించింది. చెప్పాను. నా మాట ఎన్నటికీ వమ్ముకాదు. మీరే బాగా ఆలోచించండి! కర్తవ్యం బోధపడుతుంది.''

''చిత్తం స్వామీ! తమరి పేరు తెలుసుకోవచ్చా?''

''విద్యారణ్యస్వామి అంటారు'' చెప్పాడా సాధువు.

''మీరు ఇక్కడే వుంటారా?''

''ఈ ప్రాంతంలోనే తిరుగాడుతూ వుంటాను.''

''మళ్ళీ తమరి దర్శనం చేసుకుంటాము స్వామీ'' చేతులు జోడించి పలికారిద్దరూ.

''అలాగే వెళ్ళిరండి! శుభమస్తు! ఐశ్వర్య సిద్ధిరస్తు!'' ఇద్దర్నీ దీవించాడు విద్యారణ్యస్వామి.

***

కమలాపురం చేరుకున్నారు సోదరులిద్దరూ. కొడుకులు సజీవంగా మళ్ళీ తన కళ్ళముందు కనబడగానే, కమలమ్మలో ఎనలేని ఆనందం. కన్నీళ్ళు కారుస్తూ ఇద్దర్నీ కౌగిలించుకుంది. వారి రాకకు గ్రామస్తులు కూడా సంతోషించారు. కొన్నాళ్ళపాటు ఆలోచించాక, ఓరోజు తమ గ్రామపెద్ద మాదన్నను కలుసుకొని విద్యారణ్యస్వామి తమకు చెప్పిన విషయం వివరించాడు హక్కన్న.

''అలాంటి వ్యక్తుల వాక్కు వమ్ముకాదు. నిజంగానే మీకు రాజ్యలక్ష్మి ప్రాప్తించే అవకాశం వుందేమో?'' చెప్పాడు మాదన్న.

''అదెలా సాధ్యం?'' అడిగాడు హక్కన్న. మాదన్న కూడా ఏమీ సమాధానం చెప్పలేకపోయాడు. ఇద్దరూ ఆలోచనల్లో పడ్డారు. చివరికి హక్కన్నకో ఆలోచన తట్టింది.

***

కమలాపురానికి చేరువలో వున్న హొంగళహళ్ళి ఏలిక మారయ్యను కలిశారిద్దరూ. మారయ్యకు, మాదన్నకు పూర్వ పరిచయం వుండడం మూలానా, కుశల ప్రశ్నలు అయ్యాక వచ్చిన విషయం గురించి అడిగాడు మారయ్య. హక్కన్న తన ఆలోచనకు భళ్ళున నవ్వాడు మారయ్య. ''ఆ

లూలేదు, చూలూ లేదు. కొడుకు పేరు సోమ లింగం అన్నట్టుగా వుంది నీ ఆలోచన'' చెప్పాడు మారయ్య.

''అలా అనకండి! మీలాంటి వారు సహకరిస్తే, నా ఆశయం తప్పక నెరవేరుతుంది'' ఆశగా పలికాడు హక్కన్న.

''నిన్ను చూస్తే జాలేస్తుంది. మరొకవంక నీ ధైర్యానికి ముచ్చటేస్తుంది. రాజ్యం స్థాపించడం చిన్న విషయం కాదు. అందుకు ఆర్థికబలం, అంగ బలం వుండాలి. అది లేనిదే రాజ్యస్థాపన జరగదు.''

అయినా ఆశవీడక చాలాసేపు తన వాదన వినిపించాక ''నీకు కొంత ధనం ఇస్తాను. ఇక ఆపై నీ తెలివితేటలు రుజువుపరుచుకో! సైనిక బలగాన్ని మాత్రం ఇవ్వలేను. ఈ విషయం రహస్యంగా వుంచాలి. బయటికి పొక్కితే, ముఖ్యంగా ఆ తురుష్కులకు తెలిస్తే నా పని పడతారు''

''మీరు చేసిన సహాయం మన ముగ్గురి మధ్యే వుంటుంది. బయటికి పొక్కకుండా తగిన జాగ్రత్త వహిస్తాను'' అంటూ తన వంతు భరోసా ఇచ్చాడు హక్కన్న. 'అలా అయితే సరి' అంటూ కొంత ధనాన్ని తెప్పించి హక్కన్న చేతికందించాడు మారయ్య. హక్కన్న, మాదన్న మారయ్యకు మనసారా కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

***

''ప్రజలారా! రోజురోజుకు ఆ తురుష్కుల ఆగడాలు ఎలా మితిమీరిపోతున్నాయో మీ అందరికీ తెలుసు. వారి ఆగడాలను అరికట్టాలంటే, మనల్ని మనమే రక్షించుకోవాలి. అలా రక్షణ జరగాలంటే, కత్తిపట్టగల వారందరూ ఓ దండుగా ఏర్పడండి! అందరం కలిసి వారి అరాచకాలను అంతం చేద్దాం!'' హక్కన్న ఆవేశపు పలుకులకు యువకులందరూ ముందుకు వచ్చారు. హక్కన్నలో ఆనందం. అలా ప్రతి గ్రామం పర్యటించి యువకుల దండును, ధనాన్ని సమీకరించాడు హక్కన్న, బుక్కన్న, మాదన్నలు.

విద్యారణ్యస్వామిని కలిసి, ఆయన ఆశీస్సులతో, సూచనలతో తుంగభద్ర నదీ తీరాన రాజ్యస్థాపనకు శ్రీకారం చుట్టాడు హక్కన్న. ప్రజల శ్రమదానంతో కొండ రాళ్ళు కోటగోడలుగా మారాయి. జనవాసానికి గృహాలు ఏర్పడ్డాయి. చివరికి అదొక పురమయ్యింది. దానికి 'విద్యారణ్య పురం' అని నామకరణం చేశాడు హక్కన్న. ప్రతి గ్రామంలో దండుగా వుంచిన యువకులను రప్పించి సైనికులుగా మార్చాడు. పురంలోకి చేర్చాడు. ఇదంతా తురుష్కులకు తెలియకుండా రహస్యంగా జరిగిపోయింది. అయితే 'తెలియవలసిన విషయం ఏనాటికయినా తెలియక మానదు' అన్న చందాన, చివరికి తుగ్లక్‌కు తెలిసింది. కంపిలికి తన తరపున రాజ ప్రతినిధిగా నియమించిన యూనస్‌ఖాన్‌కు చీవాట్లు పంపి, ఆ పురాన్ని నాశనం చేసి, ఆ సోదరులిద్దర్నీ పట్టి తెమ్మని ఆజ్ఞ జారీచేశాడు.

యూనస్‌ఖాన్ తన సైనిక బలగంతో విద్యారణ్య పురంపై దాడికి బయల్దేరాడు. ఈ విషయం తెలిసి, అక్కడ వున్న వీరసైనికులే కాక, ప్రజానీకం కూడా వేలసంఖ్యలో, ఆయుధాలు చేతబూని విద్యారణ్య పురానికి చేరుకున్నారు.

తన సైనికులతో యూనస్‌ఖాన్, విద్యారణ్యపురంపై దాడి ప్రారంభించాడు. అయితే ఊహించని విధంగా, ప్రజలు, వీరసైనికులు హోరాహోరీ అంటూ తురుష్క సైనికులపై కత్తులతో కదంతొక్కారు.

భీకర సమరం!

ఆ సమరంలో చాలామంది తన సైనికులు హతమయ్యేసరికి, యూనస్‌ఖాన్ యుద్ధాన్ని విరమించి, వెనక్కు పలాయనం చిత్తగించక తప్పలేదు.

తురుష్కులపై విజయం!

అందరిలోనూ ఆనందం!!

తురుష్కులపై విజయాన్ని ఓ ఉత్సవంలా జరుపుకున్నారు. ఆ సందర్భంగా విద్యారణ్యస్వామి, పుర ప్రజలను ఉద్దేశించి ఇలా పలికాడు.

''ఇది ఏ ఒక్కరి విజయం కాదు. ఇందులో అందరి భాగస్వామ్యముంది. ఇది ప్రజా విజయం. పాలకులు కిరాతకులు అయినపుడు, ప్రజలే సైనికుల్తె, తమను తాము రక్షించుకుని పొందిన విజయం! ఈ విజయం చరిత్రలో మరచిపోలేని, మరపురాని, విజయం సాధించిన పురంగా, ఓ నగరంగా, 'విజయనగరం' అని నామకరణం చేస్తున్నాను. ఇకనుంచి ఈ పురం నాపేర కాక, 'విజయ నగరం'గా పిలవబడాలని, ఇకపై మీరు అలాగే పిలుస్తారని ఆశిస్తున్నాను.

ప్రజానీకం చప్పట్లు. ''అలాగే పిలుస్తాం!'' అన్న ఆనందపు అరుపులు. ''రాయడు అంటే రాతు దేలినవాడు అని అర్థం. ఈ సోదరులిద్దరూ తమ సంకల్పబలంతో రాటుదేలి విజయం సిద్ధింపజేసుకున్నారు. ఆకాంక్ష నెరవేర్చుకున్నారు. కావున ఇక నుంచి, హక్కన్న హరిహరరాయడుగా, బుక్కన్న బుక్కరాయడుగా పిలువబడతారు. మీరందరూ కూడా ఈవిధంగానే పిలవాలి.''

''తప్పకుండా పిలుస్తాం!''

విజయనగర పురవాసుల్లో నింగికెగిసిన ఆనందం!

''హరిహరరాయడికి''

''జై''

''బుక్కరాయడికి''

''జై''

''విద్యారణ్యస్వాముల వారికి''

''జై''

అన్న జయజయధ్వనులు ఆకాశానికంటాయి.

★

*(కుందేళ్ళు కుక్కలను తరిమిన ప్రాంతం కారణంగా విజయనగరపురం ఏర్పడింది అన్నది ఓ కట్టుకథ. చారిత్రకంగా జరిగిన వాస్తవమిది! 'సంకల్పబలం వుంటే సామాన్యుడు సైతం రాజు (గొప్పవాడు) కాగలడు' అనడానికి చరిత్రలో ఉదాహరణలు ఎన్నో! అందుకు ఓ ఉదాహరణ ఈ విజయనగర గాథ!!)*

